# జీవితానికి నిర్వచనం

మీరు నూరు చెప్పండి, వెయ్యి చెప్పండి, మగవాడు ఆడదానికి లోకువ గావడానికి నేను ససేమిరా ఒప్పుకోను. అప్పటికి ఎంతో ఓపిక గలవాణ్ణి గాబట్టి పదేళ్ళ కాలం భరించాను. విసుగెత్తింది. ముఖం మొత్తింది. విరక్తి కలిగింది. విడాకులివ్వక తప్పదన్న నిర్ణయానికి వచ్చేశాను.

కలహస్వభావం కలిగి వున్నట్టయితే, డబ్బు కాజేయడానికి అలవాటుపడి వున్నట్టయితే, ఇతరులకు అనుకూలంగా నడచుకునే టట్టయితే, తృణీకారంగా ఎగతాళి పట్టిస్తూ మాట్లాడేటట్టయితే - అలాంటి భార్యను, పదిమంది బిడ్డలున్నా సరే, వదలిపెట్టమన్నాడు శాస్త్రకారుడు.

మా ఆవిడకూ నాకూ మధ్య ఏర్పడే పోట్లాటలు ప్రణయ కలహాల స్థాయి దాటి చాలాకాల మైంది. నేను సిగరెట్లు తెగకాలుస్తానట. తలమాసి, ఒళ్ళుమాసి, బట్టలుమాసి మడ్డిగా వుంటానట. సినిమాలకు రాజపోషకుడినట. జులాయిగా తిరుగుతానట. బాధ్యత అంటే నాకు భయమట. పలాయన వాదం నా నరనరాల్లో జీర్ణించిపోయిన తత్వమట. ఎందుకులెండి! ఒకటా, రెండా, ఎన్నెన్ని ఆరోపణలని? సరే, డబ్బు విషయం. నా డబ్బు నేను తన చేతికి దొరకకుండా జాగ్రత్త పడుతున్నాను కాబట్టి సరిపోయింది. లేకుంటే మా ఆవిడ నాకు నికరంగా దినభత్యం ఏర్పాటు చేసేదేమోనని నా అనుమానం! పోతే ఆవిడకు నేనొక్కణ్ణి తప్పితే మిగిలిన లోకులందరూ ఎంతో మంచి వాళ్లుగా కనిపిస్తారు. ఇంతకూ అంతకూ 'అయ్యో, మీరా!' అంటూ తాను నన్ను ఎద్దేవా చేయడం పరిపాటి అయిపోయింది. వదిలిపెట్టడానికి తగిన అవలక్షణాలన్నీ ఆవిడలో వున్నాయని మీరిప్పుడు ఒప్పుకోక తప్పదని నాకు తెలుసు. పదిమంది బిడ్డలున్నా పరవాలేదన్నాడు నీతిశాస్త్రవేత్త. మా ఆవిడ కున్నదల్లా ముగ్గురు బిడ్డలే!

వివాహ బంధానికిన్నీ భిన్న ధ్రువాలున్నాయి. ముడిపడడానికైతే పురోహితుణ్ణి కలుసుకోవాలి. విడివడాలంటే ప్లీడర్ని చూడాలి.

అడ్వొకేటు అప్పల నరసయ్య శాస్త్రిగారు లావుపాటి కళ్లద్దాలలో నుంచీ నా వైపు చూచిన చూపులోనే సవాలక్ష ప్రశ్నలున్నాయి. నేను తనకోసం ఒకకేసు తీసుకెళ్ళాననీ, అందువల్ల తనకెంతో కొంత డబ్బు ముడుడుంతనీ సంతోషించ వలసింది పోయి, అప్పటికి నేను బోనులో నిల్చున్న ముద్దాయినైనట్లు, తాను ప్రతిపక్షం తరపు వకీలైనట్టు ఆయన నాపైన క్రాసుపరీక్ష ప్రారంభించాడు.

"భార్యకు విడాలకులిస్తారా? ఏమండీ, మీరు భార్యకు విడాకులిస్తారా?" అంటూ ఆయన అసలు పాయింటు దగ్గరే సందేహం వెలిబుచ్చాడు.

"అందుకేనండీ మీ దగ్గరికొచ్చింది. లేకపోతే మీతో నాకేం పనుంటుంది?" అన్నాను.

"మంచిది. మీ కారణాలేమిటో చెప్పండి" అంటూ ఆయన ముదలంకించు కున్నాడు.

నేను పై కప్పు వంక చూచాను. కిటికీలో నుంచీ తోటకేసి చూసాను. బీరువాల్లో తలగడల్లా పేర్చిన పుస్తకాలవైపు చూచాను. ఆఖరుకు తలగోక్కుంటూ "అయ్యా, ఏం చెప్పమంటారు! నా ఆసరాలేకపోయినా తనకేమీ డోకాలేదన్న ధీమా ఒకటి ఏడ్చిందండీ ఆ మనిషిలో! నన్ను బొత్తిగా ఖాతరుచెయ్యడం లేదంటే నమ్మండి" అన్నాను.

ఈనకేమిటో బాగా అర్థమైపోయినట్టు తలపంకిస్తూ అన్నారు లాయరుగారు- "మీ ఆసరాలేకపోయినా తనకేమీ డోకాలేదని అనుకోగలుగుతూ వుందంటే, ఆమె తన కాళ్లపైన తాను నిలబడగలిగి వుందన్నమాట? అయితే మూర్తిగారూ, మీ ఆవిడ ఉద్యోగం చేస్తోందటండీ?"

"తన తల బిరుసుతనానికంతా అదేనండీ కారణం! ఆ ఉద్యోగమొక్కటి లేకపోతే యింట్లో కుక్కిన పేనులా పడివుండేది!"

"అబ్బే, అదేంమాటండీ మూర్తిగారూ! ఆడా మగా యిద్దరూ సంపాదిస్తేగానీ సంసారాలు గడవని రోజులొచ్చాయి. మీభార్య మీతోబాటుగా సంసారభారాన్ని సంచుకుంటూ వుందంటే అది మీ అదృష్టం....."

ఏమదృష్టమండీ నాబొంద అదృష్టం! పేరుకు మాత్రమే నేను పెళ్లయిన వాణ్ణి. భోజనానికి హోటలేగతి. తిన్నావా లేదా అని నా అతీ గతీ పట్టించుకునే వాళ్లులేరు. ఒంటరిగదిలో నానీడే నన్ను వెక్కిరిస్తుంది. రాత్రుల్లోనైతే నాకు జోలపాడేది దోమల సంగీత మొక్కటే!"

"ప్చ్....ప్చ్....." నాలుక చప్పరిస్తూ సానుభూతి ప్రకటించారు లాయరుగారు. "అయితే మూర్తిగారూ! మీ ఆవిడ ఉద్యోగం చేయడం ఈ వూళ్లో కాదన్నమాట?"

"కాదండీ! మదనపల్లెలో"

దొరికి దొరికి ఎలాంటి మటిబుర్ర ప్లీడరు దొరికాడురా బాబూ అనిపించిందేమో, ఈ చివరి మాట కాస్తా విసుగ్గానే అన్నాను.

"మూర్తి గారూ! మీ ఆవిడను గురించి మీకు తెలిసినన్ని వివరాలు నాకున్నూ తెలిసి వుంటాయని మీరనుకోడంలో న్యాయం లేదు. చిరాకు పడకుండా మీరు నింపాదిగా వివరాలన్నీ చెబుతే గానీ నేను మీకు సాయపడగల పరిస్థితిలో వుండను..."

మొదటి ఆర్గ్యుమెంటు పూర్తి అయినట్టుగా అడ్వొకేటు గారు పొగచుట్ట ముట్టించి గుప్పుమంటూ ఒకసారి పొగ బయటికి వదిలారు.

కొందరు పేషంట్లు తమ అంతరంగికమైన రోగాల్ని గురించి డాక్టరుతో చెప్పుకోడానికి సంకోచించడం నేను గమనించి ఉన్నాను. ప్లీడరు గారి ఎదుట నా పరిస్థితి అంతకన్నా మెరుగ్గా లేదు.

కానీ యింత దూరం వచ్చాక చెప్పక తప్పేదేముంది?

సంగ్రహంగానే చెప్పి ముగించదలచుకున్నాను.

"లాయరు గారూ! రమణ మూర్తి అనే నాకున్నూ కమలా రాణి అనే ఆమెకున్నూ పెళ్ళయి పదేళ్ళయింది. ఈ పదేళ్ళలో మేము పట్టుమని పదిరోజులు కలిసి వుండడం జరగలేదు. ఎప్పుడు వెళ్ళినా రాణిగారి కోసం నేనే వెదుక్కుంటూ వెళ్ళవలసి వచ్చింది. కాలం గడచిన కొద్దీ ఆమె నాకోసం వేచి వుండడం కూడా మానేసింది. నేను వెళ్ళినందువల్ల సంతోషం గానీ, వెళ్ళకపోయినందువల్ల విచారం గానీ ఆమెకు కలగడం లేదని నాకు స్పష్టంగా తెలిసిపోయింది. నేను నా వుబలాటం కొద్దీ తనను పట్టుకుని ప్రాకులాడుతున్నానంతే గానీ తనకు నాతో అవసరమేమీ లేదని ఆమె చెప్పకనే చెప్పేసింది.

సరే, నా బ్రతుకేదో నేను బ్రతకాలన్న నిర్ణయానికి వచ్చేశాను. అంతెందుకూ? ఒకమాట చెబుతున్నాను వినండి. చివరిసారిగా నేనామెను కలుసుకుని ఆరునెలలయింది. ఈ ఆరునెలల కాలంలో ఒక్క ఉత్తరం ముక్కయినా లేదు..."

"పోనీ, మీరైనా వ్రాయలేకపోయారా?"

నాకు ఒళ్లు మండుకొచ్చింది. "ఆడదానికే అంత బిగువుంటే మగవాడికి నాకు బిగువుండకూడదంటారా?" రెచ్చిపోతూ అడిగాను.

"మగవాడు, ఆడది అన్న విచక్షణతో గాదండీ! ఎవరికైనా పట్టు విడుపులు అవసరమన్న దృక్పథంతో చెబుతున్నాను....."

"లాయరు గారూ! నేనన్ని విషయాలూ ఆలోచించుకునే మీ దగ్గరికొచ్చాను. కోర్టు ద్వారా విడాకులు పొందడానికి నేనిప్పుడేంచేయాలో మీరు సెలవిస్తే చాలు....."

"మీరు క్లయింటుగా నా దగ్గరికొచ్చారు గదండీ మూర్తిగారూ! వినిపించుకుంటే వినిపించుకోవచ్చు. లేకపోతే మానుకోవచ్చు. మీ శ్రేయస్సును కోరి తగిన సలహా చెప్పడం నా ధర్మం. ఏమంటారు?"

"చెప్పండి" అన్నాను చేసేది లేక.

"ఏ యింటిలోనైనా మట్టి పొయ్యి వుంటుందే గానీ, బంగారు పొయ్యి వుండదు. భార్యాభర్తలన్న తర్వాత వాళ్ళ మధ్య ఎప్పుడో ఒకప్పుడు పొరపొచ్చాలు రావడం సహజమే! అభిప్రాయ భేదాలు తీవ్రమైన వైమనస్యాలకు దారి తీయవచ్చు. తెగతెంపులు చేసుకోవాలనేటంత వరకూ వ్యవహారం బెడిసి పోవచ్చు. కానీ చాలా కేసులకు సంబంధించినంత వరకూ దారాన్ని తెంపెయ్యడం కన్నా ముడి వెయ్యడమే మంచిది. ఇది స్వాభిప్రాయం మట్టుకే గాదు, స్వానుభవం కూడా!"

అప్పుడు నాకనిపించింది. ఇదంతా ఒక కొత్త రోగి పాతరోగి దగ్గరి కొచ్చినట్టయిందిరా బాబూ అని!

"ఇప్పటి మాట కాదులెండి మూర్తిగారూ!" అప్పల నర్సయ్య శాస్త్రి గారు ఆరంభించేశారు. "అప్పట్లో నేను ప్రాక్టీసు లేని లాయర్ని. బయట బోర్డుండేదే గానీ యింట్లో జరుగుబాటుకు కటకటగా వుండేది. మాలో మాకు ఏదో ఒక విషయం పైన మాట పట్టింపు వచ్చి మా ఆవిడ పుట్టింటికి వెళ్ళిపోయింది. ఒకటిగాదు, రెండుగాదు, నిండుగా మూడేండ్లు మేమొకరి ముఖం ఒకరు చూచుకోకుండానే గడిచిపోయాయి. వేస్ట్, మియర్ వేస్ట్. జీవితమనేది భగవంతుడిచ్చిన వరం లాంటిదైతే, అందులో యౌవన మనేది వసంతమైతే, ఆ అమూల్యమైన కాలంలో నిండుగా మూడేండ్లు అడవి కాచిన వెన్నెల్లా, బూడిదలో పోసిన పన్నీరులా వృధాగా గడచిపోయాయంటే అందుకు కారణమేమైనా కానివ్వండి, కలిగిన నష్టానికి జవాబుదారీ ఎవరిదంటారు? మాట వరసకు నేను కూడా మీ వాదాన్నే ఒప్పుకుంటాను. స్త్రీ పురుషుల్లో మగవాడిదే ఆధిక్యత అనుకుందాం. మరైతే అలాంటప్పుడు తన పెళ్లాం లోని లోటు పాట్లను సవరించుకుని, తన కాపురాన్ని తాను నిలబెట్టుకోవలసిన బాధ్యత ఆ మగవాడిపైన లేదంటారా?"

విడిపోయిన దంపతులు మళ్లీ ఎలా కలుసుకున్నారన్న శంక నాకు కలుగకపోలేదు. కానీ ఆ వైనం తెలుసుకున్నందువల్ల నాకొరిగేదేముంది? నేనెలాగూ మా ఆవిడతో సంబంధాలు తెంచుకోదలుచుకున్నాను. నాకిప్పుడు కావలసిందల్లా ఎడబాటును విడాకులుగా మార్చుకునే ఉపాయం మాత్రమే!

అప్పల నరసయ్య శాస్త్రి గారు ఎలాగైనా గట్టివాడే! నా యింగితమేమిటో పసిగట్టినట్టుగా ప్రారంభించేశారు.

"లీగల్ అడ్వయిస్ కోసమని వస్తే ఈ పెద్దమనిషి ధర్మోపదేశం చేస్తున్నాడేమా అని మీరనుకోవచ్చు. వద్దులెండి మూర్తిగారూ! నేను మీకు కావలసిన లీగల్ అడ్వయిస్ ఇస్తాను. మీరే గ్రౌండ్స్‌పైన మీ భార్యకు విడాకులివ్వాలనుకుంటున్నారు?

"తాను వుద్యోగం చేయడం నాకిష్టం లేదు. ఉద్యోగం వదలిపెట్టి వచ్చి బుద్ధిగా కాపురం చేసుకోగలిగితే నాకిష్టమే! తానెలాగూ యిందుకొప్పుకోదు. ఆ సంగతి నాకు నికరంగా తెలుసు."

"మీ మాటమేరకు మీ ఆవిడ ఉద్యోగం మానేస్తుందనుకోండి! అంత మాత్రాన మీ సంసారం స్వర్గధామమై పోతుందని నేననుకోను. మీదు మిక్కిలి అది నరక కూపమయ్యే అవకాశమే ఎక్కువ. ఎందుకంటే సంసారంలో సుఖమనేది ఆర్థిక పరిస్థితులపైన ఆధారపడి వుంటుందనేది మనం దాచుకోవాలన్నా దాగని సత్యం. సరే, ఆ సంగతి వదిలిపెట్టి ప్రస్తుతాంశానికి వద్దాం. భార్యాభర్తల్లో ఒకరు ఉద్యోగం చేస్తున్నారన్న కారణం పైన యింకొకరు విడాకులు కోరితే అందుకు చట్టం ఒప్పుకోదు. మీరింకొక కారణమేదైనా చూపెట్టాలి..."

"ఇంకొక కారణమా?" పరధ్యానంగా ప్రశ్నించాను.

"అవును. మీ ఆవిడ దాంపత్య జీవితానికి అర్హురాలు కాదని మీరు ఋజువు చెయ్యగలగాలి. ఋజువంటే గుర్తింపు కలిగివున్న డాక్టరు అలా సర్టిఫై చేయాలి..."

నాకు మతిపోయినంత పనయింది. "లాయరు గారూ! మా ఆవిడకు ముగ్గురు బిడ్డలండీ! దుంగలా వుంది. ఆవిడ దాంపత్య జీవితానికి అర్హురాలు కాదంటే కళ్ళు పోతాయి. బుద్ధివున్న డాక్టరెవడూ అలా సర్టిఫై చేయడు" అన్నాను.

"మరైతే యిక ఉపాయాంతరం ఒక్కటే వుంది. మీరు కోపగించుకోకపోతే చెబుతాను..."

"ఫరవాలేదు చెప్పండి" అన్నాను.

"మీ భార్య శీలం మంచిది కాదని మీరు నిరూపించగలగాలి. అదీ ఎక్కడ? కోర్టులో."

చెయ్యి చాచి బలంకొద్దీ ప్లీడరు గారి కొక లెంపకాయ ప్రసాదించాలన్నంత కోపం వచ్చింది. అంతపనీ చేయకపోయినా తటాలున పైకి లేచి, గిరుక్కున వెనుదిరిగి మళ్ళీ ఆ మనిషి ముఖం చూడకుండా వెలుపలికి వచ్చేయాలని మాత్రం అనుకున్నాను. కానీ ఆలోగా ఆ పెద్దమనిషే అడ్డు తగిలాడు.

"మూర్తిగారూ! దయచేసి ఒక నిమిషం కూచుంటారా? ఇంతసేపు మాట్లాడి మీరు వృధాగా తిరిగి వెళ్లడం నాకిష్టం లేదు..."

అదేమిటో ఆ సత్కారం కూడా చవిచూచే వెళ్దామన్న ఉద్దేశంతో గుండ్రాయిలా బిర్రబిగుసుకుని కూర్చున్నాను.

ఆయన టేబిలు పైన వున్న అట్టను తనవైపుకు జరుపుకుని, ఓ తెల్ల కాగితం పైన పెద్ద, పెద్ద అక్షరాలతో ఏవో రెండు మూడు పదాలు మాత్రం రాశాడు. ఆ కాగితాన్ని కవరులో వుంచి జిగురు పూసి శుభ్రంగా అతికించేశాడు. లేచి నిల్చుని బల్ల మీదుగా వంగి కవరును నా జేబులో వుంచేస్తూ "మూర్తిగారూ! మీకు నేనివ్వగలిగిన ఆఖరు సలహా యిందులో వుంది. ఎలాగైనా మీకు

మేలే జరగాలన్నది నా కోరిక. వెళ్ళిరండి" అన్నాడు.

బరువెక్కిన గుండెతో కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్నాను. సాయంకాలం ఆరు గంటలైంది. ఎందరో భార్యాభర్తలు జంటలు జంటలుగా సినిమాలకో, పార్కులకో వెళ్తున్నారు. కొందరు బిడ్డలను కూడా తమవెంట తీసుకెళ్తున్నారు. నాకొక్కడికి మాత్రమే అలాంటి అదృష్టం లేకపోయింది. ఆ అదృష్టం చేజారిపోవడంలో మీ బాధ్యత లేదంటారా అంటూ అప్పల నరసయ్య శాస్త్రిగారు వేసిన ప్రశ్న ఇంకా నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వుంది.

దారిలో నేను ఓరోడ్డు యాక్సిడెంటు నుంచీ వెంట్రుక మాత్రంలో తప్పించుకో గలిగాను. ఆదమరచి నడుస్తున్నానేమో ఆటో ఒకటి నన్ను దూసుకుంటూ వెళ్లింది. పైకి వచ్చేసిందేమో నన్న భయంతో ఓ గావుకేక పెట్టేశాను. ఆటో ముందుకు వెళ్ళి పది బారల దూరంలో ఆగింది. ఆగిన వాహనంలో నుంచీ ఓ ఆడముఖం ఈవలికి కనిపించింది.

"ఏమిటండీ మూర్తిగారూ! రోడ్డుపైన నిద్రపోతూ నడుస్తారా ఎవరైనా? ప్రమాదం కదూ! జలంధర్ నుంచి మావారొచ్చారు లెండి! సినిమాకు వెళ్తున్నాం. టైమైపోతోంది గనుక డ్రైవర్ని మేమే కాస్త తొందరగా వెళ్ళమన్నాం. యాక్సిడెంటు తప్పిందంతే చాలు. మీరు జాగ్రత్తగా నడవండి బాబూ! వెళ్తాం మరి..."

ఆమె పేరు శశిరేఖ. మా ఆఫీసులో ఉద్యోగిని. భర్తకు మిలిటరీ లో ఉద్యోగం. ఉత్తరదేశంలో వున్నాడు. సెలవుల్లో వచ్చినట్టున్నాడు.

డస్సిపోయిన శరీరాన్ని మరే ప్రమాదానికీన్నీ లోనుకానీకుండా రక్షించుకుంటూ నేనెలాగో నా గదికి చేరుకున్నాను. కాళ్ళయినా కడుక్కోకుండా మంచం పైన వ్రాలిపోయాను.

అలా రెండు మూడు గంటలు గడిచిన తర్వాత గానీ నేనాపూట భోజనం చేయలేదన్న సంగతి జ్ఞప్తికి వచ్చింది కాదు.

అప్పుడిక లేచి హోటలు దాకా వెళ్ళగలిగిన ఓపిక కూడా లేదు.

అలాగే నిద్ర పోవడానికి ప్రయత్నించాను.

నిద్ర రాలేదు.

నిద్రపట్టని ఆ దీర్ఘ రాత్రివేళ, ఏ వేళప్పుడు నాకు జ్ఞాపకం వచ్చిందో చెప్పలేను. ఉన్నట్టుండి బుర్రలో ఓ మెరుపు మెరిసినట్టయింది.

వంకీకి తగిలించిన చొక్కా జేబులో నుంచీ కవరు పైకి తీశాను.

చించి చూచాను....

* * *

మరునాటి సాయంకాలానికల్లా నేను మదనపల్లిలో వున్నాను.

హఠాత్తుగా వెళ్ళి ప్రత్యక్షమయ్యేసరికి మా ఆవిడ ఆశ్చర్యానికీన్నీ, బిడ్డల ఆనందానికీన్నీ అవధుల్లేవు.

కమల బాయిలర్ నిండుకూ నీళ్ళు కాచింది. ఒళ్ళులిసిపోయేటట్టుగా స్నానం చేశాను. నాకిష్టమైన కూరలతో వంట చేసింది. సుష్టుగా భోజనం చేశాను.

"జేబులో సిగరెట్లు లేనట్లున్నాయి. తెప్పించమంటారా?" అంది.

"వద్దులే, మానేస్తాను" అన్నాను.

"ఏమండీ, నేను బొత్తిగా మానేయమన్నానా? పోనీ, రోజుకొక్క ప్యాకెట్ మాత్రం

కాల్చండి..." బుంగమూతి పెట్టింది కమల. (నిజం చెప్పొద్దూ, బుంగమూతి పెట్టినప్పుడు కమల భలే బాగుంటుంది)

"అదైనా నువ్వొప్పుకుంటేనే! నీకిష్టం లేకపోతే మానేయడమే...."

కమల తన చెవుల్ని తాను నమ్మలేకపోయింది.

పిల్లలు పడుకుని నిద్రపోయారు.

"ఏమండీ, పిల్లలు నిద్రపోయాక నేనెన్ని రాత్రులు వెక్కిళ్ళు పెట్టి ఏడ్చానో తెలుసా? 'అమ్మా, నాన్నగారెప్పుడొస్తారే, అని బిడ్డలడిగినప్పుడల్లా నా గుండెలవిసిపోయేవి. బింకానికి పోయి ఉత్తరం రాయకపోవడం నా పొరపాటే. నన్ను మన్నించరూ? ఇకమీదట మీరెలా చెబుతే అలాగే నడుచుకుంటాను. ఉద్యోగం మానేయమన్నా సరే, మానేస్తాను..."

"వద్దులే కమలా! ఉద్యోగం వదులుకుంటే మళ్ళీ దొరుకుతుందా? పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. ఒకరి సంపాదనతో సంసారం గడవకపోవచ్చు..." అన్నాను.

"మరైతే మీరొప్పుకుంటేనే చేస్తాను. అదైనా యింత దూరంలో వుండి కాదు. ఎవరితోనైనా చెప్పి నన్ను మీకు దగ్గరగా వుండేటట్టు మార్పించుకోరూ?"

ఈ దఫా నాచెవుల్ని నేను నమ్మలేకపోయాను.

* * *

అడ్వొకేటు అప్పల నరసయ్య శాస్త్రి గారికి నాలో నేను కృతజ్ఞతలు చెప్పుకున్నానని చెప్పకుండా ఈ కథను ముగించడం భావ్యంగా వుండదు. అక్షరలక్షలు విలువచేసే ఆయన సలహా నాదగ్గర పదిలంగా వుంది.

మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంటూ వుంటాను -

"జీవితానికి నిర్వచనం - సర్దుబాటు."

*(ఆంధ్రభూమి వారపత్రిక 1978)*